క్లుప్తంగా

9న ఉగాది ఆస్థానం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 9వ తేదీన ఉగాది పర్వదినం సందర్భంగా ఆస్థానం జరుగనుంది. ఇందులో భాగంగా సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు పంచాగ శ్రవణం, ఉగాది స్థానం జరగనుంది.

4న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

గోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 4వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈనెల 9న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాగశ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి వంటి అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను ఉదయం 9.30 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం



ప్రత్యేక ప్రతిభావంతులకు సరుకులు అందజేస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయమని శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, డీఎస్పీ ఉమామహేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని నగరవీధిలో గల హెల్పింగ్ హ్యాండ్స్ కార్యాలయంలో సోమవారం పేదలు, ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అదే విధంగా మహిళలకు 200 చీరలను, హెల్పింగ్ హ్యాండ్స్‌లో పనిచేస్తున్న వారికి రంజాన్ పండుగను పురస్కరించుకుని కుటుంబానికి కావాల్సిన పట్టువస్త్రాలు, పండుగ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో బాబా ఫరీద్, మునీర్ బాషా, రాజేశ్వరరావు, సుజాత, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అదనపు వేతనం



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధి కూలీలకు వేసవిలో అదనపు కూలి ఇస్తున్నట్టు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం సీతారాంపేటలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల మస్టర్‌ను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో కూలీలకు రోజుకు రూ.272 వేతనం ఉండేదన్నారు. ఏప్రిల్ 1 నుంచి రూ.300లకు పెంచినట్లు వివరించారు. పనుల్లో కొలతలను బట్టి వేతనం వస్తుందన్నారు. రోజురోజుకూ ఎండతీవ్రత పెరుగుతోందన్నారు. పని ప్రదేశంలో కూలీలకు నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలన్నారు. కూలీలు ఉదయం 6 నుంచి 10 గంటలలోపు పనులు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పొలాల్లో పండ్లు, పూలు, మునగ తోటల పెంపకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో దేవరి, సీడీసీఎల్ఆర్సీ చంద్రశేఖర్ రాజు, జేఈ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు మనోహర్, సీనియర్ మేట్ సరిత పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



తిరుమల: తిరుమల రెండో ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న భక్తులు పెను ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి నుంచి తిరుమలకు సప్తగిరి ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. రెండవ ఘాట్ రోడ్డు మీదుగా తిరుమలకు వస్తున్న బస్సు హరిణి సమీపంలో అకస్మాత్తుగా అదుపుతప్పి పక్కనే ఉన్న రక్షణ గోడను ఢీకొని చెట్టును లోయలోకి పడకుండా ఆగిపోయింది. అక్కడ చెట్టు లేకపోతే మాత్రం ఘోరప్రమాదం చోటుచేసుకునేది. ఈ ప్రమాదంలో భక్తులు స్వల్పగాయాలతో బయట పడ్డారు. రోడ్డుపైన ఇంజిన్ ఆయిల్ ఉండడంతోనే బస్సు అదుపు తప్పినట్లు సమాచారం. దీంతో ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అలిపిరి డిపో ఆర్టీసీ అధికారులు, టీటీడీ ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా తిరిగిన బస్సును సరిచేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

నేత్రప్రదాయనీ నమోనమామి





నేత్రప్రదాయిని దేశమ్మ దేవత సేవలో మంత్రి ఆర్కే రోజా, పూర్ణాహుతి పూజల్లో మంత్రి ఆర్కే రోజా

నగరి: నేత్రప్రదాయని అమ్మవారి ఆలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా హోమ పూజలు చేశారు. మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగలోని నేత్రప్రదాయని దేశమ్మ దేవత ఆలయం రూ.3 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించి ఈ ఏడాది ఫిబ్రవరిలో కుంభాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుంభాభిషేకం తదుపరి ఆలయంలో మండల పూజలు ప్రారంభమయ్యాయి. 48 రోజుల పాటు మండల పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆ పూజల ముగింపు సందర్భంగా సోమవారం ఆలయంలో నిర్వహించిన హోమపూజల్లో మంత్రి పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా పూర్ణాహుతి పూజలు చేపట్టారు. అమ్మవారి పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేయగా మంత్రి దర్శించుకొని అమ్మవారి తీర్థాన్ని సేవించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వేణుబాబు, నాయకులు వెంకటేశ్, శశికుమార్, దయానిధి, ఇంద్రారెడ్డి, సుదర్శనం నాయుడు, తిరుమలరెడ్డి, ఎల్లప్పరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతను ఆదరించండి

విజయపురం: ఐదేళ్లలో సంక్షేమ పథకం అందించిన జగనన్న ఆదరించాలని, మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని నియోజకవర్గ పరిశీలకులు, ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సిందేపల్లి మధుసూదన్ రెడ్డి అన్నారు. మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాధవరం పంచాయతీలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ వంద శాతం నెరవేర్చిన ఏకైక నాయకుడు జగనన్న అని అన్నారు. అలాంటి జగనన్నను ఆదరించి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అలాగే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన రోజమ్మకు మరోసారి ఓటువేసి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ గోపిరాజు, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, సర్పంచ్ మమత, శ్రీరాములురెడ్డి, ఎంపీటీసీ అంబిక, మండల బూత్ కన్వీనర్ రాజ్‌గోపాల్, వెంకటేశ్, కిషోర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాండియన్, సర్పంచ్ బాబు, రమేష్, అంగముత్తు, గోవిందస్వామి, విష్ణు, వెంకటేశ్, కుమార్, కృష్ణమూర్తి, హరి, నాగరాజు, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ వితరణ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈవో ఎస్వీ నాగేశ్వరరావు మాట్లాడుతూ వేసవి దృష్ట్యా స్వామి అమ్మవార్ల దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎండ వేడిమికి ఉపశమనం కలిగించేలా అన్నదానం విభాగం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వేసవిని పురస్కరించుకుని భక్తులు ఇబ్బందులు పడకుండా పలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నగరి బార్ కౌన్సిల్‌కు నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జడ్జి

నగరి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులోని బార్ కౌన్సిల్‌కు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ న్యాయవాదుల ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. బార్ కౌన్సిల్ అధ్యక్షులుగా ఎంజె జగదీషన్, ఉపాధ్యక్షులుగా ఈజీ బాబు, కార్యదర్శిగా రావూరి పురుషోత్తం, ఉప కార్యదర్శిగా ఎం అరుణ్, కోశాధికారిగా ఎం.నాగరాజన్ ఎన్నికయ్యారు. జడ్జి విష్ణువర్మ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతూ ప్రశాంత వాతావరణంలో కోర్టు నడవడానికి నూతన కార్యవర్గం సహకరించాలన్నారు. సీనియర్ న్యాయవాదులు టీ మురళీధర్, పి ఉదయభాను, మహాదేవన్, చిరంజీవులు, ఎం మణివాసగం, ఎం బాబు, ఎస్ జాన్‌జోష్, త్యాగరాజన్, మురళీకృష్ణ, తిరుమలయ్య, ధరణి, హనీఫా, రామ్, దీపక్ పాల్గొన్నారు.

మదర్స్ మిల్క్ బ్యాంక్ ప్రారంభం రేపు

తిరుపతి కల్చరల్: తల్లిపాలకు నోచుకోక పోషకాహార లోపంతో అనారోగ్యానికి గురై శిశువులు మరణిస్తున్నారని, వీటిని తగ్గించాలనే సంకల్పంతో ప్రభుత్వ ప్రసూతి, శిశు వైద్యశాల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రోటరీ తల్లిపాల నిధి బుధవారం ప్రారంభించనున్నట్లు రోటరీ క్లబ్ కార్యదర్శి సోము రవికుమార్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన తల్లిపాలనిధి ప్రారంభానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న తల్లిపాల నిధి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అతిథి సింగ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని చెప్పారు.

డీవీఆర్ కండ్రిగలో నీటి సమస్య పరిష్కారం



బోరువద్ద నిలబడి కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామస్తులు

నగరి: మండలంలోని బీరకుప్పం పంచాయతీకి చెందిన డీవీఆర్ కండ్రిగకు ఎంతో కాలంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. మంత్రి ఆర్కేరోజా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన సమయంలో స్థానికులు నీటి సమస్యను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆమె వెంటనే చర్యలు చేపట్టినా నీటి జాడ లేకపోవడంతో ఆలస్యమవుతూ వచ్చింది. గత నెల 16వ తేదీన బోరు వేయగా తాగునీరు పుష్కలంగా వచ్చింది. ఆపై పైపులైన్లు ఏర్పాటుచేసే పనిని ప్రారంభించి సోమవారం పూర్తి చేశారు. గ్రామానికి తాగునీరు అందడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. బోరు వేసిన ప్రాంతంలో నిలబడి మంత్రి ఆర్కేరోజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునస్వామి, చంద్రారెడ్డి, గోవర్ధన్, ఏలుమలై రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు

- తొలి రోజు అలిపిరిలో మెట్లోత్సవం

తిరుపతి కల్చరల్: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 521వ వర్ధంతి ఉత్సవాలు ఈనెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా తొలి రోజైన 4వ తేదీన టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవం చేపట్టనున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, భజన మండళ్ల కళాకారులు ఉదయం 6 గంటల నుంచి అన్నమాచార్యుల వారి సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం నిర్వహిస్తారు. అనంతరం శాస్త్రోక్తంగా మెట్లపూజ జరగనుంది. తర్వాత కళాకారులు సంకీర్తనలు గానం చేస్తూ కాలినడకన తిరుమల గిరులను అధిరోహిస్తారు. టీటీడీ ఉన్నతాధికారులు, రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన భజన మండళ్ల కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అన్నమయ్య వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 5వ తేదీన తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో గోష్ఠిగానం, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు. 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సులు నిర్వహించనున్నారు. అలాగే తాళ్లపాకలోని ధ్యాన మందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటేద్దాం.. సంక్షేమంతో జీవిద్దాం



తిప్పాపురం ఎన్నికల ప్రచారంలో నాయకులు

నింద్ర: రాష్ట్రంలో జగనన్న అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఫ్యాను గుర్తుకు ఓటేద్దాం అని రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్ పిలుపునిచ్చారు. మండలంలోని తిప్పాపురం కీళంబాకం, చవరంబాకం దళితవాడల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మట్లాడుతూ టీడీపీ మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఇంటింటి ప్రచారంలో నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఫ్యాను గుర్తుకు ఓటేస్తే , సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వస్తాయని స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ఒక్కటికూడా అమలు చేయలేదని గుర్తుచేశారు. జగనన్న ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చే పథకాలు అమలు చేసి అందరినీ ఆదరించిన నాయకుడు అన్నారు. నగరి నియోజకవర్గంలో రోజమ్మ ప్రతి గ్రామం అభివృద్ధి చేసిందని వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓటేయాలని, రోజమ్మను ఎమ్మెల్యే తిరిగి గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుబా, మండల కన్వీనర్ వేణురాజు, సింగిల్ విండో అధ్యక్షులు మునికృష్ణారెడ్డి, ఆర్‌బీకే చెర్మన్ వీరయ్య, కో–ఆప్షన్ సభ్యులు అనిల్ ఎంపీటీసీ సభ్యులు విజేష, సర్పంచ్‌లు బాబురెడ్డి, సుబ్బయ్య, సత్యరాజ్, మహేష్, గంగాధరం, తదితరులు పాల్గొన్నారు.

రోజమ్మను మరోసారి గెలిపించుకుందాం



ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళలు

పుత్తూరు: నగరి నియోజకవర్గ ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజాను మరోసారి గెలిపించుకుందామని మున్సిపాలిటీ 22వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రవిశేఖర్‌వర్మ ఓటర్లను అభ్యర్థించారు. వార్డులోని ఇంటింటికీ వెళ్లి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. వర్మ మాట్లాడుతూ ప్రజా రంజకపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా, నగరి ఎమ్మెల్యేగా మూడోసారి రోజమ్మకు పట్టం కడదామని పిలుపునిచ్చారు. గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని చెప్పారు. నేడు జగనన్న ఐదేళ్ల పాలనలో అద్భుతాలు చేశారని, ఇందుకు దేశ ప్రధాని ప్రశంసలే నిదర్శనమన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని వివరించారు. ఇలాంటి సీఎం మనకు రావడం రాష్ట్ర ప్రజలు చేసుకొన్న అదృష్టమని అభివర్ణించారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నను సీఎంగా చేసుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నగరి ఎమ్మెల్యేగా మంత్రి రోజమ్మకు మరో అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు లత, భారతి, ఏకాంబరం, మురళీరాజు, లారీమోహన్, మనోహర్‌రెడ్డి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోండి

తిరుపతి సిటీ: వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని విద్యార్థులు, యువత ఉపాధి, ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేయాలని కేంద్ర వ్యవసాయ పరిశోధన మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ అన్నారు. సోమవారం తిరుపతిలోని వ్యవసాయ కళాశాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్రాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత, పోషక భద్రత యువ వ్యవసాయ శాస్త్రవేత్తల చేతుల్లో ఉందన్నారు. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న వనరులను దృష్టిలో పెట్టుకుని అధిక దిగుబడులను పొందే సాంకేతిక పరిజ్ఞానం వైపు పరిశోధనలు జరగాలన్నారు. అనంతరం ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో భాగంగా కళాశాలలో కల్పించిన సౌకర్యాలు, ఆధునిక వ్యవసాయ విధానాలు, పరిశోధనల గురించి అధ్యాపకులు, విద్యార్థులను విచారించారు. అనంతరం వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఏర్పాటు చేసిన ప్రయోగశాలలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఔత్సాహికులకు కేంద్రప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను ఆయన వివరించారు. అనంతరం ఆయనను వీసీ, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి, అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ కరుణాకర్‌సాగర్, డాక్టర్ ఎ.మణి, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ సత్యగోపాల్, డాక్టర్ మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం

- ప్రారంభానికి సిద్ధంగా తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయం



సరికొత్తగా సిద్ధమైన తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయం

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో వెలసిన అత్యంత ప్రాచీనమైన శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయం సరికొత్త హంగులతో పునర్నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ఆరంభానికి సిద్ధమైంది. హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పునః ప్రారంభ పనులు పూర్తి చేశారు. ఈ మేరకు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఆలయ జీర్ణోద్ధరణ–పునః ప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవం క్రతువు ప్రారంభం కానుంది. తిరుపతి క్షేత్ర గ్రామ దేవత శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ దేవతా యంత్రం, విగ్రహం, శిఖర కలశ పునఃప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు యాగశాల సంస్కారాలు, దీక్షా ప్రకరణం, వాస్తు యాగం, పర్యగ్నికరణం చేపట్టి, సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, రాత్రి 7 గంటలకు జలాధివాసం నిర్వహిస్తారు. 3వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు పంచగవ్య అధివాసం, బింబ శుద్ధి, సాయంత్రం 4 గంటలకు ధాన్యాధివాసం, 5 గంటలకు పుష్పాధివాసం, 7 గంటలకు శయ్యాధివాసం వంటి కార్యక్రమాలు చేపడతారు. చివరి రోజు గురువారం ఉదయం 6.24 గంటలకు గర్త న్యాస, శిలన్యాస, రత్నన్యాస, ధాతున్యాసములు చేపడతారు. అనంతరం 8.20 నుంచి 9.10 గంటల మధ్య శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ యంత్ర, విగ్రహ, శిఖరకలశ, స్థాపన జరుగనుంది. 10.45 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. తరువాత 11.44 గంటలకు అభిజిత్ లగ్నంలో మహా కుంభాభిషేక మహోత్సవం శాస్త్రోక్తంగా చేపడతారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి దివ్య మంగళ విగ్రహానికి సర్వాలంకరణ చేపట్టి శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ దేవత ప్రథమ దర్శనం, నక్షత్ర హారతి నిర్వహిస్తారు. అనంతరం 12.30 గంటలకు అన్న సంతర్పణం, అన్నప్రసాద వినియోగం నిర్వహించనున్నారు. ఈ కుంభాభిషేక మహోత్సవానికి ప్రత్యేక ఆహ్వానితులుగా టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, గౌరవ అతిథులుగా దేవదాయ శాఖ అధికారులు హాజరు కానున్నారు.

పేదరిక నిర్మూలన జగనన్నతోనే సాధ్యం

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి



మేము సిద్ధం-మా బూత్ సిద్ధం అంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుత్తూరు: రాష్ట్రంలో పేదరిక నిర్మూలన జరగాలంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్ ప్రసాద్‌రెడ్డి అన్నారు. పేదరిక నిర్మూలన అనే బృహత్తర కార్యక్రమం సాధించుకోవాలంటే త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను మరోమారు సీఎంగా చేసుకోవడంతోపాటు నగరి నుంచి మంత్రి రోజమ్మను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. వడమాలపేట మండలం అప్పలాయగుంట పంచాయతీలో సోమవారం 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో రామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ సీఎం జగనన్న నేతృత్వంలో మంత్రి ఆర్కే రోజా అందించిన సంక్షేమ ఫలాలను వడమాలపేట మండలంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న సీఎం అయిన తర్వాత మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలను సంక్షేమ పథకాలతో ఆదుకున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి పనులు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నేళ్లు బ్రతికామని కాదు, ఎలా బ్రతికామన్న తన తండ్రి వైఎస్సార్ చూపిన బాటలో తండ్రికి తగ్గ తనయుడిగా జగనన్న పేదప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు స్కాములు చేసి, ప్రజాధనాన్ని దోచేసి, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన జగనన్న రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఏనాడూ కుంటిసాకులు చెప్పకుండా ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చారని తెలిపారు. ఇదే చంద్రబాబుకు, జగనన్నకు ఉన్న తేడా అన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి స్కాముల బాబును రాష్ట్రం నుంచి తరిమికొట్టి, సంక్షేమం, అభివృద్ధి అంటూ పరితపిస్తున్న జగనన్నను నిండు మనసుతో ఆదరించాలని కోరారు. ఈ ఇంటి ఆడపడుచు అయిన మంత్రి రోజమ్మను నగరి ఎమ్మెల్యేగా మూడవసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషాద్రి రెడ్డి, ఎంపీటీసీ రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధీర్‌రెడ్డి, మునిబాబు, రాజేంద్ర, చిన్నప్ప, జయచంద్రారెడ్డి, నందయ్య, సురేష్‌రాజు, కిరణ్‌కుమార్, లోకేష్, రమేష్, నారాయణరాజు, నాని పాల్గొన్నారు.

14 నుంచి అగస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు ఘనంగా జరుగనున్నాయని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం సోమవారం తెలిపారు. 13న సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు గణపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహిస్తారు. ఏప్రిల్ 14వ తేదీ ఉదయం 6.30 నుంచి 7.30 గంటల మధ్య మేష లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై అగస్తీశ్వరస్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రోజూ ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రోజూ రాత్రి 7 గంటలకు స్వామివారి వాహనసేవ ఉంటుంది. 15న సింహ వాహనం, 16న హంస వాహనం, 17న శేషవాహనం, 18న నంది వాహనం, 19న గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 20న రథోత్సవం కనులపండువగా జరుగనుంది. ఏప్రిల్ 21న రాత్రి 7 గంటలకు కల్యాణోత్సవం, అనంతరం అశ్వవాహన సేవ జరుగనున్నాయి. రూ.500 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనే గృహస్తులకు ఉత్తరీయం, రవికె, లడ్డూ, అప్పం, అన్నప్రసాదాలను బహుమానంగా అందజేస్తారు. 22న ఉదయం 9 గంటలకు శ్రీ నటరాజస్వామివారి వీధి ఉత్సవం జరుగనుంది. రాత్రి 7 గంటలకు రావణేశ్వర వాహనంపై అగస్తీశ్వరస్వామి దర్శనమిస్తారు. 23న కైలాసకోనలో త్రిశూలస్నానం ఘనంగా నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో రోజూ కోలాటం, ఆధ్యాత్మిక, భక్తిసంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆలయ చరిత..

నారాయణవనం ప్రాంతాన్ని పరిపాలించిన శ్రీ పద్మావతీదేవి తండ్రి అయిన శ్రీ ఆకాశ మహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు పురాణాల నుంచి తెలుస్తోంది. ఇక్కడ శ్రీ అగస్తీశ్వరస్వామివారు స్వయంభుగా వెలిశారు. స్వామివారి లింగాకారానికి పీఠభాగం అనగా బాణపట్టమును అమర్చి వేద ఆగమశాస్త్ర ప్రకారం శ్రీ అగస్త్య మహర్షులవారు ప్రతిష్ఠ చేసి పూజించడం వల్ల స్వామివారికి అగస్తీశ్వరస్వామి అని పేరు వచ్చింది.